

సమాచార హక్కు చట్టానికి..

ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం అమలు తీరు అధ్వానంగా ఉంది.

- 10లో ▸



దేశం కోసం పనిచేసే పార్టీ..

దేశం కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి అన్నారు.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.9 /21.9

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండతీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని 33/11 కేవీ వినాయక్‌నగర్, తిలక్‌గార్డెన్, సుభాష్‌నగర్, ఎస్‌హెచ్‌బీ సబ్‌స్టేషన్లలో నెలవారీ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టౌన్ ఏడీఈ ఆర్ చంద్రశేఖర్, టౌన్–2 ఏడీఈ ఆర్ ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్, హనుమాన్ జంక్షన్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, 100 ఫీట్ల రోడ్డు, ఐపీఎస్ స్కూల్ ఏరియా, గూడెం, తుల్జాభవానీ ఆలయం, సాయికృపానగర్, యోగేశ్వర్ కాలనీ, ఇంద్రాణి స్కూల్, దత్తాత్రేయ ఆలయం, శ్రీనగర్ కాలనీ, కోటగల్లి, యెండల టవర్స్, గాయత్రి నగర్, పద్మానగర్, మదీనా, ఫులాంగ్ మసీద్, పాటిగల్లి తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.

పోలీస్ స్టేషన్ల తనిఖీ



ఖలీల్‌వాడి: నగరంలోని మూడు, నాలుగు టౌన్లతోపాటు నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సీపీ పోతరాజు సాయిచైతన్య శుక్రవారం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, కంప్యూటర్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. 5ఎస్ విధానం అమలుపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఎవరైనా గంజాయికి బానిసలైతే వారికి కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. సైబర్ మోసగాళ్ల నుంచి ప్రజలు మోసపోకుండా అప్రమత్తం చేయాలని సూచించారు. సీపీ వెంట ట్రైయినీ ఐపీఎస్ సాయికిరణ్ పత్తిపాక, ఏసీపీ ఎల్ రాజా వెంకట్ రెడ్డి, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, సౌత్ రూరల్ సీఐ సురేశ్ కుమార్, ఎస్సైలు గంగాధర్, శ్రీకాంత్, ఎండీ ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

30 వరకు 'భూ భారతి' అవగాహన సదస్సులు

నిజామాబాద్ అర్బన్: 'భూ భారతి' చట్టంపై జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది వరకే ఆయా మండలాలకు అవగాహన సదస్సుల నిర్వహణకు సంబంధించి సమావేశ వేదికలు, సమయాలను నిర్దేశించినట్లు తెలిపారు. మండల కేంద్రాల్లోనే అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

తాగునీరు, ధాన్యం కొనుగోళ్లపై 'కంట్రోల్ రూం'

- టోల్ ఫ్రీ నంబర్ల ఏర్పాటు

నిజామాబాద్అర్బన్: జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తినా, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులుంటే ఫిర్యాదు చేసేందుకు వీలుగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1800 425 6644 కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని సూచించారు. కార్యాలయాల పని దినాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య ఉంటే 7382844951, ధాన్యం అమ్మకాల్లో ఇబ్బందులుంటే 7382844769 ఫోన్ నంబర్లకు వాట్సాప్ చేయాలని సూచించారు. idocnizamabad@gmail.comకు మెయిల్ ద్వారా కూడా సమాచారం అందించాలని పేర్కొన్నారు.

21 నుంచి కిసాన్ మేళా



నిజామాబాద్ సిటీ: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23 వరకు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాలలో 'కిసాన్ మేళా' నిర్వహించనున్నట్లు వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మేళాను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రారంభిస్తారని, మూడు రోజులపాటు జరిగే ఈ మేళాలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు, వారి ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచనున్నట్లు వివరించారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై మేళాను విజయవంతం చేయాలని కోరారు.


ఆశలకు ప్రైవేటు గాలం

ధర్పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన సుమలత (పేరు మార్చాం) అనే గర్భిణిని అదే గ్రామానికి చెందిన ఓ ఆశ కార్యకర్త జిల్లా కేంద్రంలోని ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి డెలివరీ కోసం తీసుకువచ్చారు. సదరు గర్భిణికి నెలలు నిండడంతోపాటు పిండం అడ్డం తిరిగిందని, సిజేరియన్ చేయకపోతే తల్లీబిడ్డల ప్రాణాలకు ప్రమాదమని వైద్యులు చెప్పారు. దీంతో కుటుంబసభ్యులు సిజేరియన్‌కు ఒప్పుకొని, రూ.80 వేల వరకు అన్ని ఖర్చులతో ప్యాకేజీ ఒప్పందం చేసుకున్నారు. ఇందులో నుంచి సదరు 'ఆశ'కు 30 శాతానికి పైగా కమీషన్‌ను అందించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.



కొరవడిన నిఘా..

జిల్లాలోని ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రులపై నిఘా కొరవడింది. గత కలెక్టర్, డీఎంహెచ్‌వోల సమన్వయంతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసి పలు మార్లు సమీక్షించడంతో ప్రైవేటులో సిజేరియన్లు తగ్గాయి. ఏడాదిగా నిఘా తగ్గడంతో సిజేరియన్లు అమాంతం పెరిగాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు తమ కేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రులకు డెలివరీకి తీసుకెళ్తే మీకేం వస్తుంది. అదే మా ఆస్పత్రికి పంపిస్తే డెలివరీ కోసం చెల్లించే ఫీజులో 30 నుంచి 40 శాతం వరకు కమీషన్ ఇస్తాం. ఎక్కువ మందిని పంపిస్తే ఇంకా ఎక్కువ కమీషన్ ఇస్తాం.

– ఓ ఆశ కార్యకర్తతో ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకుడి మాటలు

- గైనిక్ ఆస్పత్రుల్లో రిఫరల్ దందా
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగ్గిన సాధారణ ప్రసవాలు
- ప్రైవేట్‌లో పెరుగుతున్న సిజేరియన్లు
- ఆర్‌ఎంపీ, పీఎంపీల మాదిరిగానే ఆశ కార్యకర్తలకు కమీషన్లు
- చోద్యం చూస్తున్న వైద్యారోగ్యశాఖ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ప్రైవేటు గైనిక్ ఆస్పత్రుల్లో రిఫరల్ దందా జోరుగా సాగుతోంది. మొన్నటి వరకు ఈ దందాలో ఆర్‌ఎంపీ, పీఎంపీలే ప్రముఖ పాత్ర పోషించేవారు. తాజాగా ఈ మార్గంలోకి ఆశ కార్యకర్తలూ ప్రవేశించినట్లు తెలుస్తోంది. మహిళలు గర్భం దాల్చిన నుంచి డెలివరీ అయ్యే వరకు వైద్య పరీక్షలు చేయించుకోవడంతోపాటు ఏ చిన్న సమస్య ఎదురైనా ఆశ వర్కర్లను ఆశ్రయిస్తున్నారు. ఆశ వర్కర్ల సూచనలు తప్పక పాటిస్తున్నారు. డెలివరీ సమయంలోనూ వారి ద్వారానే ఆస్పత్రులకు వెళుతుంటారు. దీన్నే అదనుగా చేసుకొన్న ప్రైవేటు గైనిగ్ ఆస్పత్రులు.. ఆశవర్కర్లకు కమీషన్ ఆశ చూపుతున్నారు. కాసులకు కక్కుర్తి పడుతున్న పలువురు ఆశ వర్కర్లు.. గర్భిణులను ప్రైవేటుకే తరలిస్తున్నారు.

ప్రైవేటులో ఫుల్.. సర్కారుకు నిల్

జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడీ, ద్వారకానగర్, పోచమ్మగల్లీ, ప్రగతినగర్, హైద్రాబాద్‌రోడ్, బోధన్‌రోడ్, తదితర ప్రాంతాల్లో కలిపి 70 పైగా ప్రైవేట్ గైనిక్ ఆస్పత్రులున్నాయి. బోధన్, ఆర్మూర్‌లో పదుల సంఖ్యలో గైనిక్ ఆస్పత్రులు ఉన్నాయి. ఏ ఆస్పత్రుల్లో చూసినా రిఫరల్ దందా జోరుగా కొనసాగుతోంది. ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎలాగూ రిఫరల్ చేస్తూనే ఉన్నారు. వీరికి తోడు కొన్ని నెలలుగా 'ఆశ' కార్యకర్తలు సైతం రిఫరల్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలీవరీల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి ప్రత్యేకంగా నిఘా పెట్టడంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ల సంఖ్య తగ్గి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలీవరీలు పెరిగాయి. కొన్ని నెలలుగా పట్టించుకునే వారు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఆర్‌ఎంపీ, పీఎంపీల మాదిరిగానే ఆశలకు ప్రోత్సాహకాలు అందిస్తూ మభ్యపెడుతున్నారు. హోటళ్లలో బిర్యానీలు తినిపిస్తూ మాయమాటలు చెప్పి కమీషన్ల పేరిట ఆశ చూపుతున్నారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫరల్స్ పెరిగాయి. ఏ ఆస్పత్రిలో చూసినా సిజేరియన్లు పోటాపోటీగా సాగుతున్నాయి. కాగా, సాధారణ డెలివరీ చేస్తే కేవలం రూ. 25 వేల లోపు ఫీజు ఉంటుంది. అదే సిజేరియన్లు చేస్తే కుటుంబసభ్యులను భయపెట్టి మరీ రూ. 60 వేల నుంచి రూ.80 వేల వరకు, అవసరమైతే రూ. లక్ష వరకు కూడా వసూలు చేస్తున్న ఆస్పత్రులు ఉన్నాయి.

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెలివరీలు ఇలా..

నెల/ సంవత్సరం	ప్రభుత్వ నార్మల్	ప్రభుత్వ సిజేరియన్	ప్రైవేట్ నార్మల్	ప్రైవేట్ సిజేరియన్	మొత్తం డెలివరీలు
జనవరి-24	484	529	106	1069	2188
ఫిబ్రవరి-24	393	418	124	829	1764
మార్చి-24	456	458	173	968	2055
ఏప్రిల్-24	391	465	138	946	1940
మే-24	379	459	140	946	1924
జూన్-24	362	398	99	812	1671
జులై-24	378	425	106	862	1771
ఆగస్టు-24	476	436	110	983	2005
సెప్టెంబర్-24	462	461	123	1038	2084
అక్టోబర్-24	473	511	123	943	2050
నవంబర్-24	476	513	112	961	2062
డిసెంబర్-24	437	480	88	839	1844
జనవరి-25	446	486	76	880	1888
ఫిబ్రవరి-25	420	465	90	980	1955
మార్చి-25	402	460	102	996	1960

చర్యలు తప్పవు



ఆశ కార్యకర్తలు ప్రైవేట్ ఆస్పత్రులకు గర్భిణులను డెలివరీల కోసం రిఫర్ చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలున్నాయి. ఆశ కార్యకర్తలు డెలివరీల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకే తీసుకురావాలి. ఇప్పటి నుంచి మరింత నిఘా పెడతాం. – బీ రాజశ్రీ, డీఎంహెచ్‌వో

గుడ్ ఫ్రైడే



నిర్మల హృదయంతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని జిల్లాలోని చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తును శిలువ వేసిన రోజు ప్రాశస్త్యాన్ని పాస్టర్లు, ఫాదర్లు వివరించారు.

కమ్మర్‌పల్లిలో ఈదురు గాలులు



నేలరాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు

కమ్మర్‌పల్లి: మండలంలో శుక్రవారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మామిడి తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. ఉప్లూర్, నాగాపూర్‌లో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మండల కేంద్రంలో ఆకుల బాలకృష్ణకు చెందిన మామిడి తోటలో కాయలు నేలరాలి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది.

రేపు ఎంజేపీ గురుకుల ప్రవేశపరీక్ష

నిజామాబాద్అర్బన్: మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన తొమ్మిది కేంద్రాల్లో 2,611 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని, విద్యార్థులు హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

భారతీయ సంస్కృతి గొప్పది

- హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి

రెంజల్: భారతీయ సంస్కృతి శ్రేష్టమైందని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి అన్నారు. రుషీ పరంపర గొప్పదని, పూర్వీకులు అందించిన ఆచార వ్యవహారాలను పాటించి, దీపాలు ఆర్పే పాశ్చాత్య సంస్కృతిని తరిమివేయాలని సూచించారు. రెంజల్ మండలం కందకుర్తిలో శుక్రవారం నిర్వహించిన విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భక్తులను ఉద్దేశించి స్వామీజీ ప్రవచించారు. మానవ సేవయే మాధవ సేవ అన్నారు. ధర్మ, అర్థ, కామ, మోక్షం ద్వారా జీవితం ధన్యమవుతుందన్నారు. అంతకు ముందు గ్రామంలో పలు విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో పిట్ల కృష్ణ మహరాజ్, మంగిరాములు మహరాజ్, సీతారాం త్యాగి మహరాజ్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు సుందర్‌రెడ్డి, తిప్పేస్వామి, మోహన్‌రెడ్డి, ప్రసాద్, సోమయాజులు, దుర్గారెడ్డి, సుధాకర్‌రెడ్డి, లింగం, చంద్రశేఖర్, నిమ్మల ప్రసాద్, గురచరణం, శివకుమార్, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి పాల్గొన్నారు.



కందకుర్తిలో ప్రవచిస్తున్న విద్యారణ్య భారతీస్వామి

భూ భారతిపై అవగాహన అవసరం

- 'సాదాబైనామా'కు త్వరలో మార్గదర్శకాలు
- ఆధార్ తరహాలో భూధార్ సంఖ్య కేటాయింపు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



డిచ్‌పల్లిలో భూభారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

డిచ్‌పల్లి/మోపాల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి, మోపాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలలో శుక్రవారం వేర్వేరుగా నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఏడాది కాలంలోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే మొదటి వారంలో అధికారులు గ్రామాల వారీగా సదస్సులను ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. భూభారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువు లోపు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్‌కు అధికారాలు కల్పించారని వివరించారు. ఆర్థిక స్తోమత లేని పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు.

గ్రామ స్థాయిలో రెవెన్యూ రికార్డులు..

గ్రామాల్లోనే రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం ప్రదర్శిస్తారని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి ప్రతి గ్రామంలో గ్రామపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్ కార్డు మాదిరి భూమికి భూధార్ సంఖ్య కేటాయిస్తారని, దీంతో భూ ఆక్రమణలకు అవకాశం ఉండదన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా పరిష్కారం కోసం త్వరలోనే మార్గదర్శకాలు వెలువడనున్నాయన్నారు. సదస్సులలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ తారాచంద్, డిచ్‌పల్లి మండల స్పెషల్ ఆఫీసర్ యోహాన్, తహసీల్దార్లు ప్రభాకర్, రామేశ్వర్, ఏవోలు సుధామాధురి, సౌమ్య, డీటీ శ్రీకాంత్, ఆర్‌ఐలు సంతోష్, రాజేశ్వర్, సొసైటీ చైర్మన్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' అక్రమాలకు కళ్లెం పడేనా?

- రేపటి నుంచి ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు
- సమన్వయకర్తలు చెప్పిన వారికే చీఫ్ సూపరింటెండెంట్, డీవో విధులు
- మూడేళ్లుగా అనుకూలమైన వారే ఇన్విజిలేటర్లు
- పైరవీలకు పెద్దపీట వేస్తున్న విద్యాశాఖాధికారులు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఓపెన్ స్కూల్ పరీక్షలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. గతంలో చూచిరాతలు, మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన సందర్భాలున్నాయి. ఈ ఏడాది కూడా పరీక్షల్లో అక్రమాలకు కొందరు చక్రం తిప్పుతున్నారు. పరీక్షల నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించే చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు(డీవో), ఇన్విజిలేటర్లను తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు విద్యాశాఖ అధికారుల వద్ద పావులు కదుపుతున్నారు. కాగా, ప్రతి ఏడాది వేసవిలో నిర్వహించే ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా చేసేందుకు పోటీ ఎక్కువగా ఉంటోంది. వేసవిలో వచ్చే సంపాదిత సెలవుల (ఈఎల్స్) కోసం ఉపాధ్యాయులు పోటీ పడుతుంటారు. పరీక్షా కేంద్రాల్లో చూచిరాతలనూ ప్రోత్సహిస్తుంటారనే ఆరోపణలున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..

ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు నిజామాబాద్ జిల్లాలో 17, కామారెడ్డి జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్ల జాబితా పరీక్షలు ప్రారంభమయ్యేంత వరకు గోప్యంగా ఉంచుతున్నారు. ఈ ఏడాది కూడా జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఇంకా పెట్టలేదు. గత మూడేళ్లుగా జిల్లాలో ప్రధానంగా ఆర్మూర్ డివిజన్‌లోని పరీక్షా కేంద్రాల్లో పాత వారినే సీఎస్, డీవోలుగా నియమిస్తున్నారు. ఈ సెంటర్లకు సంబంధించి వేల్పూర్, జక్రాన్‌పల్లి, ఆర్మూర్, భీంగల్‌కు చెందిన దాదాపు 10 మంది ఉపాధ్యాయులు ఐదేళ్లుగా డ్యూటీలు చేస్తున్నారు. ఇందులో ఒక ప్రధాన ఉపాధ్యాయ సంఘానికి చెందిన డివిజన్ నాయకుడు చక్రం తిప్పుతున్నాడనేది బహిరంగ రహస్యంగా చెప్పవచ్చు. అలాగే ప్రతి కేంద్రంలో అవసరానికి మించి ఎక్కువ మందికి డ్యూటీలు వేయడంతో వారిలో చాలా మంది కేంద్రాలకు రాకుండానే డ్యూటీ సర్టిఫికెట్లు పొందుతూ సంపాదిత సెలవులు పొందుతున్నారు. గత మూడేళ్లుగాపై నాలుగు మండలాల ఎంఈవోలు తీసిన ఉత్తర్వు కాపీలను విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తే అవకతవకలు బయటపడుతాయని ఉపాధ్యాయవర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్మూర్ పట్టణంలోని బాలికల పాఠశాలలో గతేడాది 13 మంది ఇన్విజిలేటర్లకు డ్యూటీ వేయగా అందులో 10 మందికి గత మూడేళ్లుగా సెంటర్లు మారుస్తూ డ్యూటీ వేస్తున్నారు. జిల్లాలో చాలా కేంద్రాల్లో పాత వారికే డ్యూటీలు వేస్తూ చూచిరాతలు నడిపిస్తున్నట్లు సమాచారం.

రూ.600ల చొప్పున వసూలు

నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పరీక్షా కేంద్రాలలో సింహభాగం కేంద్రాలు చూచిరాతలకు అడ్డాగా మారాయి. గతేడాది ఆర్మూర్ పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రంలో ఒక్కో అభ్యర్థి నుంచి రూ.600 వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. గత సంవత్సర తప్పిదాలు పునరావృతం కాకుండా ఇటీవల అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మరి ఈసారైనా చూచిరాతలకు ఫుల్‌స్టాప్ పడుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

ఏర్పాట్లు పూర్తి చేశాం..

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 25 పరీక్షా కేంద్రాల్లో 4,600 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. డీఈవో ఆధ్వర్యంలో సీఎస్‌లు, డీవోలకు అవగాహన కల్పించాం. శనివారం ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పిస్తారు. ప్రశ్నపత్రాలు సంబంధిత పోలీస్ స్టేషన్లకు చేర్చాం. ఈసారి ఈఎల్స్ ఇవ్వడం లేదు. కొందరు ఇన్విజిలేటర్లను కూడా మార్చాం. చూచిరాతలు అరికట్టేలా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్

క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌లో షటర్ వివాదం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ ముందు శుక్రవారం ఓ షటర్ వ్యవహారంలో వివాదం చోటుచేసుకుంది. 20 ఏళ్ల క్రితం నుంచి బస్టాండ్ ముందు షటర్ వేసుకుని టీ వ్యాపారం చేసుకుంటున్నామని తమదే ఆ షటర్ అని ఓ మహిళ తెలిపింది. ఆ షటర్‌ను ఆర్టీసీ యూనియన్‌కు కేటాయించినట్లు నాయకులు తెలిపారు. ఆ షటర్ తమదేనంటూ ఇరు వర్గాలు వాగ్వాదం చేసుకున్నాయి. పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. ఆర్టీసీ అధికారులు విచారణ జరుపుతారని పోలీసులు వారికి నచ్చజెప్పి గొడవను సద్దుమనిగించారు.

రోడ్డుపైనే ధాన్యం ఆరబోత



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి, పర్మళ్ల, శెట్పల్లి, భవానిపేట, ఒంటర్‌పల్లితో పాటు పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు పైనే ధాన్యం ఆరబోశారు. రైతులకు ధాన్యం ఆరబెట్టడానికి కళ్లాలు లేకపోవడంతో రోడ్లపైనే ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

దగ్ధమైన ఈత వనాల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలో ఈదుల్ల వాగు వద్ద ఇటీవల దగ్ధమైన ఈత వనాన్ని శుక్రవారం పరిశీలించినట్లు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ తెలిపారు. సుమారు 300 ఈత చెట్లు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయా, ఎవరైనా దహనం చేశారా అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆయన వెంట ఎల్లారెడ్డి ఎక్సైజ్ ఎస్సై జగన్మోహన్, సిబ్బంది ఉన్నారు.

స.హ. చట్టానికి సహాయ నిరాకరణ

ఆర్మూర్ మండలం దేగాం గ్రామానికి చెందిన స.హ. ఉద్యమకారుడు జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి 2024-25 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య వివరాల కోసం దరఖాస్తు చేశాడు. అధికారులు 2023-24కు చెందిన విద్యార్థుల వివరాలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు.

జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఓ స.హ. ఉద్యమకారుడు జిల్లా పౌర సరఫరాల శాఖకు సీఎంఆర్ బియ్యం వివరాల కోసం దరఖాస్తు చేయగా పీఐవో ఇవ్వలేదు. మొదట అప్పీలు చేసినా స్పందన లేదు. గత్యంతరం లేక సమాచార కమిషన్‌కు రెండోసారి అప్పీలు చేశాడు.

కామారెడ్డి జిల్లాలో రెవెన్యూ, నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ కార్యాలయాలు సమాచారం ఇవ్వడం లేదంటు ఇటీవల కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు.


- సమాచార కమిషనర్లు లేక గుట్టలుగా పెరుగుతున్న అప్పీళ్లు, ఫిర్యాదులు
- సమీక్షలు లేవు, కానరాని 4(1) బి సమాచారం
- ఉమ్మడి జిల్లాలో స.హ. చట్టం సమాధి

పై మూడు ఉదాహరణలు చాలు. ఉమ్మడి జిల్లాలో స.హ. చట్టం అమలు అధ్వాన స్థితి గురించి. ప్రజలకు ప్రశ్నించేతత్వాన్ని నేర్పిన స.హ. చట్టం రెండు దశాబ్దాలుగా ఎన్నో అక్రమాలను బయటపెట్టింది. కానీ ఇది నాణానికి ఒక పార్శ్వం మాత్రమే. ఉమ్మడి జిల్లాలో చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో స.హ. చట్టం అమలు తీరు అధ్వానంగా ఉంది. సాధారణ సమాచారం కూడా సరిగా ఇవ్వడం లేదు. రాష్ట్రంలో సమాచార కమిషనర్లు లేక అధికారులు స.హ. చట్టానికి విలువ ఇవ్వడం లేదు. మరో పక్క కమిషన్‌లో అప్పీళ్లు, ఫిర్యాదులు కొండల్లా పెరిగి సామాన్య పౌరులకు సమాచారం అందని ద్రాక్షగా మారింది.

సిరికొండ: పాలనలో పారదర్శకతకు బాటలేయాలి.. అధికారుల్లో జవాబుదారీతనం పెంపొందించాలి.. అవినీతిని కాగడపెట్టి తరిమేయాలి.. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పరిరక్షించాలి.. అనే సంకల్పంతో అమలులోకి వచ్చిన ఏకైక చట్టం సమాచార హక్కు (సహ)చట్టం. కానీ దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో స.హ. చట్టం అమలుకు ఏర్పడిన సమాచార కమిషన్ సమాచారం ఇవ్వని అధికారులకు జరిమానాలు విధిస్తున్నా తీరు మారడం లేదు. సాధారణ సమాచారం అయితే ఇస్తున్నారు కానీ అవినీతి గల సమాచారం లోపాలు గల సమాచారం ఇవ్వడం లేదు.

అధికారుల కప్పదాటు వైఖరి

సమాచార హక్కు చట్టం సెక్షన్ 6 ద్వారా వచ్చిన దరఖాస్తులను సదరు ప్రజా సమాచార అధికారులు పట్టించుకోవడం లేదు. సెక్షన్7(1) ప్రకారం 30 రోజుల్లో ఇవ్వాల్సిన సమాచారం నెలలు గడుస్తున్నా ఇవ్వడం లేదు. ప్రతి ఏడాది పదుల సంఖ్యలో స.హ.చట్టంపై శిక్షణ పొందుతున్న అధికారులు నిబంధనలను మాత్రం పాటించడం లేదు.



జక్రాన్‌పల్లి మండలానికి చెందిన ఓ దరఖాస్తుదారుడు ఆర్మూర్ విద్యుత్ డివిజన్ కార్యాలయానికి స.హ. దరఖాస్తు చేస్తే అది నిజామాబాద్ డివిజన్‌కు చెందిన సమాచారం కావున సెక్షన్ 6(3) ప్రకారం ఐదు రోజుల్లో దరఖాస్తును బదిలీ చేయాలి. ఈ దరఖాస్తుకు సంబంధించిన సమాచారం మా దగ్గర లేదని సమాచారం ఇచ్చారు. స.హ. చట్టం ప్రాథమిక అంశాలు తెలిసిన కూడా సదరు పీఐవో సహ చట్టం గురించి నాకేమీ తెలియదన్నట్లు ప్రవర్తించారు. అలాగే కామారెడ్డి జిల్లాలో రెవెన్యూ, నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ కార్యాలయాలు సమాచారం ఇవ్వడం లేదంటు ఇటీవల కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. ప్రజాప్రతినిధికి సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగితే సామాన్య పౌరుల పరిస్థితి ఏంటని స.హ. ఉద్యమకారులు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలో చాలా కార్యాలయాలు 4(1) బీకి చెందిన 17 అంశాలు స్వచ్ఛందంగా వెల్లడించడం లేదు. జిల్లా శాఖలో మూడు నెలలకోసారి జరగాల్సిన సమీక్ష సమావేశాలు జరగడం లేదు. నిజామాబాద్ జిల్లా విద్యా శాఖలో సమాచారం ఇవ్వడంలో అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. ఓ విషయంలో గతంలో వచ్చిన తీర్పులను అన్ని విషయాలు జోడిస్తూ సెక్షన్8 ని సాకుగా చూపి సమాచారం ఇవ్వడంలో సదరు పౌరసమాచార అధికారిణి సహాయ నిరాకరణ చేస్తున్నారు.

పెరుగుతున్న ఫిర్యాదులు

గత ప్రభుత్వ హయాంలో ఫిబ్రవరి 2023లో సమాచార కమిషనర్లు పదవీ విరమణ చేయడంతో కమిషన్ ఖాళీ అయింది. అప్పటి వరకు ఉమ్మడి జిల్లా నుంచి 371 అప్పీళ్లు, 232 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం సమాచార కమిషనర్లను నియమించక పోవడంతో అప్పీళ్లు, ఫిర్యాదులు కొండల్లా పెరుగుతున్నాయి. ఇటీవల తెలంగాణ సమాచార కమిషన్‌లో సమాచార కమిషనర్ల నియామకం గురించి సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి 476 అప్పీళ్లు, 283 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. కమిషనర్లు లేకపోవడంతో స.హ. చట్టానికి విలువ లేకుండా పోతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రజా సమాచార అధికారులు సమాచారం ఇవ్వడంలో అంతులేని నిర్లక్ష్యం చూపుతున్నారు.

కమిషనర్లను నియమించాలి



రాష్ట్రంలో సమాచార కమిషనర్ల నియామకం గత రెండేళ్లుగా జరగలేదు. దీంతో స.హ. చట్టం పక్కాగా అమలు కావడం లేదు. 30 రోజుల్లో ఇవ్వాల్సిన సమాచారం నెలలు గడుస్తున్నా ఇవ్వడం లేదు. 4(1)బి 17 అంశాలు స్వచ్ఛందంగా వెల్లడించడం లేదు. – మహేందర్‌గౌడ్, స.హ. రక్షణ వేదిక జిల్లా కోకన్వీనర్

స.హ. చట్టానికి విలువేది



జిల్లాలో అన్ని శాఖల ప్రజాసమాచార అధికారులకు శిక్షణ ఇస్తున్నా కనీస ప్రాథమిక అంశాలను కూడా పాటించడం లేదు. సమాచారం కోసం ఎక్కువ మొత్తంలో డబ్బులు అడుగుతున్నారు. దరఖాస్తు బదిలీ నిర్ణీత సమయంలో చేయడం లేదు.

– భాస్కర్, స.హ. రక్షణ వేదిక ప్రతినిధి

దేశం కోసం పనిచేసే పార్టీ బీజేపీ



అంజిరెడ్డి, మల్క కొమురయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, పసుపు బోర్డు చైర్మన్, నాయకులు

- నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్: దేశం, ధర్మం కోసం పని చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని వర్ని చౌరస్తాలో ఉన్న జనార్దన్ గార్డెన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి అధ్యక్షతన గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్యకు ఆత్మీయ అభినందన సభను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేసే వరకూ కార్యకర్తలు అవిశ్రాంతంగా పోరాడాలని, అప్పుడే రాష్ట్రంలో హిందువులు అనుకున్న విధానాలు అమలవుతాయని అన్నారు. హిందువులంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసేందుకు అనేక శక్తులు కుట్రలు పన్నుతున్నాయని పేర్కొన్నారు. కానీ హిందూ సమాజాన్ని జాగృతం చేసేందుకు బీజేపీ, సంఘ్ పరివార్ సంస్థలు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. త్రిపుల్ తలాక్‌తో ముస్లిం మహిళలకు, వక్ఫ్ బోర్డు సవరణతో పేద ముస్లిములకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. దేశంలోని అన్ని పార్టీలు ఏకమైనా.. మోదీని ఏం చేయలేవని, దేశమంతా బీజేపీ వైపే ఉందన్నారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపు బాధ్యత మాదే..

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు చేసిన కృషితోనే విజయం సాధ్యమైందని, భవిష్యత్తులో బీజేపీ, బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు బాధ్యతను తాము తీసుకుంటామని ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీల గెలుపు కార్యకర్తలకు అంకితమని వారు అన్నారు.

ఎమ్మెల్సీల గెలుపులో కార్యకర్తల కృషి

ఎమ్మెల్సీల గెలుపులో కార్యకర్తల కృషి వెలకట్టలేనిదని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు పార్టీపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిడి స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కంచెట్టి గంగాధర్, మాదాసు స్వామి యాదవ్, పద్మారెడ్డి, బుస్సాపూర్ శంకర్, కొండా ఆశన్న పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరుతో పోలీసు పాలన

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన పేరుతో పోలీసు పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గంలో ప్రజాపాలన పేరుమీద రాక్షస పాలన నడుస్తోందని పేర్కొన్నారు. దీనికి ఉదాహరణ ఇటీవల భీమ్‌గల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వచ్చినపుడు ఏమి జరిగిందో ప్రజలంతా చూశారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం చెక్కులతో పాటు తులం బంగారం ఇవ్వాలని మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. మహిళలకు, వృద్ధులకు, బీడీ కార్మికులకు ఇస్తామన్న పింఛన్లు, బాల్కొండ నియోజకవర్గంలో రూ. రెండు లక్షల రుణమాఫీ అందరికీ రాలేదని మంత్రిని అడిగితే అక్కడున్న కాంగ్రెస్ కార్యకర్తలు గొడవ చేశారన్నారు. తనను, కేసీఆర్‌ను డౌన్ డౌన్ అంటూ దాడికి సిద్ధమయ్యారని ఆరోపించారు. పోలీసులు కాంగ్రెస్ వారిని ఏమాత్రం అదుపు చేయకుండా, కేవలం ప్లకార్డులు పట్టుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీ చార్జి చేసి తీవ్రంగా కొట్టారని అన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి పోలీసులను ఆదేశించి తనపై, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు 30 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టించాడని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల తరపున పోరాడుతామని వెల్లడించారు.

యువతిని వేధించిన యువకుడి అరెస్ట్



బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని సోషల్ మీడియాలో వేధించిన నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందుకుర్తి గ్రామానికి చెందిన అలీమ్ బేగ్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు బోథ్ ఎస్సై ఎల్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. యువతిని గత కొంతకాలంగా సోషల్ మీడియాలో అలీమ్‌బేగ్ వేధిస్తున్నాడని తెలిపారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు అలీమ్‌బేగ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కాగా అలీమ్‌బేగ్‌పై రౌడీషీట్ ఉన్నట్లు పేర్కొన్నారు. రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో నాలుగు కేసులు ఉన్నాయన్నారు. డిచ్‌పెల్లి పోలీస్‌స్టేషన్‌లో 2023లో అలీమ్‌బేగ్ వద్ద నుంచి 17 బైక్‌లు రికవరీ చేసినట్లు తెలిపారు.

నాటు తుపాకులతో పాటు ఇద్దరి అరెస్టు

తాడ్వాయి: మండలంలోని కన్‌కల్ గ్రామంలో నాటు తుపాకులతో తిరుగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన తిల్ పీత్య మహేందర్‌సింగ్, తిల్ పీత్య ఇందర్‌సింగ్ మండలంలోని కన్‌కల్‌లో కొంతకాలంగా నివసిస్తూ లేబర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు శుక్రవారం తాడ్వాయిలోని కల్లు డిపో వద్ద నాటుతుపాకులతో తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే అక్కడికి చేరుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఎల్లారెడ్డి: పట్టణంలోని గ్యాస్ గోదాంలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అగ్నిమాపక అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాంలో అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ అధికారులు వినోద్, నరేందర్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



ఖలీల్‌వాడి: గుండెపోటుతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీకి చెందిన బాచుపల్లి భానుచందర్(36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడో టౌన్ పరిధిలోని రైతు బజార్ వద్ద ఉన్న వైన్స్ దుకాణం ఎదురుగా ఆటోను నిలిపి పాటలు వింటున్నాడు. ఆటోలో మూడు గంటల పాటు అతను కదలకుండా ఉండడాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీని ఢీకొన్న మరో లారీ



భిక్కనూరు: మండల సమీపంలోని టోల్ ప్లాజా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. టోల్ ప్లాజా వద్ద నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో వెనుక లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో కామారెడ్డికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నాగిరెడ్డిపేట: మండలంలోని గోలిలింగాల సమీపంలో ఉన్న మంజీరా నది నుంచి గురువారం రాత్రి ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. గోలిలింగాలకు చెందిన కోడె గంగారాం, తొంట సిద్ధిరాములు, పిట్ల సత్యనారాయణ, పుట్ల సంతోష్, కాంచనపల్లి లింగాగౌడ్, పుట్ల కిష్టయ్య ఎలాంటి అనుమతులు లేకుండా మంజీరా నుంచి అక్రమంగా ఇసుకను తరలించేందుకు యత్నిస్తుండగా సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఒకరిపై దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ వద్ద పడుకొని ఉన్న కుభీర్ మండలానికి చెందిన కుంచెపు బాబుపై గుర్తు తెలియని వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. రైల్వే టికెట్ కౌంటర్ వద్ద బాబుతో అనవసరంగా గొడవ పడి మెడపై బ్లేడ్‌తో దాడి చేశాడన్నారు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. నిందుతుడి పరారీలో ఉన్నాడని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

తాడ్వాయి: తాడ్వాయి పోలీసు పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. తన ఇంటి ఎదుట ఉన్న మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



పెద్దకొడప్‌గల్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన పెద్దకొడప్‌గల్ మండలం రతన్‌సింగ్ తండాలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన వెంకట్ అనే వ్యక్తి కొన్ని నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. పలుమార్లు ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చేవాడు. ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లిన వెంకట్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

కామారెడ్డి జిల్లాలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బుచ్చయ్య (ఫైల్)

పిట్లం: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన పిట్లం మండలం సిద్దాపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై రాజు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన కె బుచ్చయ్య చారి(42) పిట్లం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకొని పిట్లం నుంచి బాన్సువాడకు బైక్‌పై వెళ్తుండగా సిద్దాపూర్ శివారులోని చెరువు కట్ట ప్రాంతంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



శ్రీనివాస్ (ఫైల్)

భిక్కనూరు: లారీని వెనుక నుంచి ఓ బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండలం కల్వరాలకు చెందిన శ్రీనివాస్(42) బీబీపేటలో ఉన్న బంధువుల శుభకార్యానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా జంగంపల్లి శివారులో రోడ్డుపై నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మరొకరు..



పెద్దకొడప్‌గల్: పనిచేస్తున్న ప్రాంతంలో వెలగని బల్బును సరిచేస్తున్న ఓ వ్యక్తికి విద్యుదాఘాతం సంభవించి మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్ మండలం జగన్నాథ్‌పల్లి తండా శివారులో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాందేడ్‌కు చెందిన గజానన్(25) తండా శివారులోని ఇటుక బట్టీలో ఐదు నెలలుగా కూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం వేకువ జామున పనిచేస్తున్న ప్రదేశంలో వెలగని బల్బును సరిచేస్తుండగా విద్యుదాఘాతం సంభవించి కింద పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు బాన్సువాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: గుర్తు తెలియని వ్యక్తి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి వస్తున్న గూడ్స్ రైలు డిచ్‌పల్లి పరిధిలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయస్సు 40 ఏళ్ల వరకు ఉంటాడని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి ఫొటో ఆధారంగా ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712658591 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

జీవితంపై విరక్తితో మరొకరు..

కామారెడ్డి క్రైం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివోళ్ల చిన్నగంగయ్య(55) కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. డబ్బుల కోసం కుటుంబ సభ్యులను వేధించేవాడు. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన అతను కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. శుక్రవారం ఉదయం తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

200 సైలెన్సర్ల ధ్వంసం



ఖలీల్‌వాడి: వాహన సైలెన్సర్లు మార్చి శబ్ద కాలుష్యానికి కారకులవుతున్న యువకులపై నగర పోలీసులు కొరడా ఝులిపించారు. వాహనాల తయారీ కంపెనీ ఇచ్చిన సైలెన్సర్ కాకుండా మాడిఫైడ్ సైలెన్సర్లను అమర్చుకుని కొందరు నగరంలో తిరుగుతున్నారు. ఆయా వాహనాలు రోడ్లపై వెళ్తుంటే భారీ శబ్దం వెలువడుతుంది. దీంతో గుండెజబ్బులు ఉన్నవారు, చిన్నారులు, వృద్ధులు ఆందోళనకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో నగర పోలీసులు ఇటీవల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 200 వాహనాలకు ఉన్న మాడిఫైడ్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటన్నింటినీ శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆధ్వర్యంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. వాహనదారులకు జరిమానాలు విధించి వాటిని రోడ్డు రోలర్‌తో తొక్కించినట్లు ఏసీపీ తెలిపారు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. మైనర్లకు తల్లి దండ్రులు వాహనాలను ఇవ్వొద్దని అన్నారు. శబ్ద కాలుష్యం ఏర్పడితే జరిమానా, జైలు శిక్ష విధిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు ప్రసాద్, శేఖర్, ఎస్సై సుమన్, రహిమాతుల్లా సిబ్బంది ఉన్నారు.

ఆలయంలో చోరీ

భిక్కనూరు: మండలంలోని సిద్దరామేశ్వరనగర్‌లో ఉన్న పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం వేకువజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తాళాలను పగుల గొట్టి అమ్మవారి మెడలో ఉన్న బంగారు పుస్తెలు, ముక్కుపుడకను దొంగిలించారు. ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లి కొద్దిదూరంలో ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును అపహరించుకెళ్లారు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు ఎత్తుకెళ్లిన అమ్మవారి ఆభరణాల విలువ సుమారు రూ. రెండు లక్షల వరకు ఉంటుందని భక్తులు తెలిపారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్: మండల కేంద్రానికి చెందిన బంజ సిద్దవ్వ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డట్లు ఎస్సై రంజిత్ శుక్రవారం తెలిపారు. ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లగా దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న రూ. పది వేల నగదు, కొద్దిపాటి వెండి, బంగారం చోరీకి గురైందని బాధుతురాలి తెలిపింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో సీఐ సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్బర్‌బాగ్‌లో..

ఖలీల్‌వాడి: నగరంలోని అక్బర్‌బాగ్ కాలనీలో గురువారం రాత్రి తాళం ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై వెంకట్రావు శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన రెహమాన్ ఇంట్లో దుండుగుల చోరీకి పాల్పడ్డారని అన్నారు. బీరువాలో ఉన్న సుమారు 13 గ్రాముల బంగారం, 40 గ్రాముల వెండి, కొంత నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.